# గోరోజనం చిలక!

అవును నాకు తెలుసు. చిలకతల్లి వీధిలోకి వెళ్ళాలంటే చాలు ఎంతగానో ముస్తాబౌతుంది. ఆడాళ్ళంటే చాలు వీధిలోని వాళ్ళంతా ఆత్రంగా చూస్తారుగా... ఈ వేళప్పుడు జిడ్డు ముఖమేసుకొని వీధిలో ఎలా తిరుగుతుంది? ముఖాన్ని మార్చాలి. చీర మార్చాలి. నప్పని బ్లౌజు ఒలిచి నప్పేది ధరించాలి. తగిన జోడు కాలికీ చెవికీ తొడగాలి. బంగారమూ, వజ్రాల నగలతో వొళ్ళు మెర్సిపోవాలి. సూది ముక్కుతో సౌందర్యాన్ని పీల్చి హమ్మయ్య అనుకోవాలి.

చిలకతల్లి సింగారించుకొని ఎదురింటి కూనలమ్మతో చీరలు కొనేందుకు చకచకా బయలుదేరింది.

ఈ కొట్టు కాదు ఆ కొట్టు కాదు అనుకుంటూ కాళ్లు పీకేదాక తిరిగి తిరిగి ఓ కొట్టులో పంకాగాలి క్రింద ఇద్దరూ చతికిలబడ్డారు. హాండ్ కర్చిఫ్‌తో ముఖమూ కంఠమూ అద్దుకుంటూ, ఆ సుఖానికి కొట్టు స్వంతమైనట్లు చుట్టూ చూసి హమ్మయ్య అనుకున్నారు.

కొనేది చిలకతల్లి కాబట్టి, 'ఇంతకన్నా మంచివి లేవూ... మంచివి లేవూ...' అంటూ విసుగెత్తి పోతూన్న సేల్సుబాయ్‌ని గమనిస్తూనే గమనించనట్టు సోగ్గా నవ్వుతూ, అతని విసుగును తుడిచేస్తున్నట్టు తమాషాగా చూసింది.

అలా ఆ యువకుణ్ణి ఆహ్లాదపరుస్తూనే 'మరోటి చూపండి... మరోటి' అంటూ 'ఇంతకన్నా ఖరీదైనవి లేవూ... లేవూ...' అంటూనేఉంది చిలక.

కూనలమ్మ, 'ఇంక రండి, ఇక్కడ మనకు నచ్చేవి ఉండవ్...' అంది. విసుగు ఆమెనో మొట్టికాయ మొట్టింది.

'ఉండండక్కయ్యగారూ... చాలా మంచివి ఖరీదైనవి ఈ షాపులో ఉంటాయి...' అంది చిలక తల్లి.

చిలకతల్లి అసలు పేరు రామచిలక. రామ ఎగిరిపోయి చిలక మిగిలిపోగా తండ్రి;

'మా చిలకతల్లి ఏదీ... ఏదీ...' అని నిత్యం, క్షణ క్షణం ఆ పిల్లను వెదుక్కోవడంతో అది చూసిన పిల్లలంతా 'చిలకతల్లి... చికలతల్లి...' అని గొల్లున గోల చేస్తూ అరిచేవారు. పిలిచేవారు. 'వీధి పిల్లలు పెట్టిన పేరు... ఇదే బాగుంది ఇదే బాగుంది, అనుకున్నారు ఆ తల్లీ తండ్రీ. అంచాత చిలకతల్లి పేరు మంచిదే... అలాగని ఏదైనా ఓ చిలకకు ఈమెగారే తల్లి అనిగాని, ఈమె ఉత్తిముసలి చిలక అనికాని అనుకోకండి. చిలక తల్లి ఎప్పుడూ బంగారు చిలకే. ఆమెకు ముసలితనం రాదు.

విసుగెత్తిపోయిన ఆ కొట్టు కుర్రాడు, 'ఉండండి.. నిన్ననే వచ్చాయి ఇంకా పార్శిలు విప్పలేదు. వస్తానంటూ...' లోనికి వెళ్ళిపోయాడు చిలకవైపు చూస్తూ ఆ పొంకం మా గొప్పగా ఉంది...' అనుకుంటూ.

"లోనికి మేమూ రావొచ్చా..." అంది చిలక. అతను విననట్లే వెళ్ళిపోయాడు. ఓ అరగంటలో సంచెడు చీరలతో వచ్చాడు. షిఫాన్లు, జార్జెట్లు, టెర్లిన్లు, టెరికాట్‌లు కళ్ల జిగేల్‌మనిపోయేవి తెచ్చాడు. ఖరీదులు మా గొప్పగా ఉన్నాయి. గొప్ప చిలక తల్లికి గొప్ప చీరలు!

"ఇంత ఆలస్యంగా వచ్చావేమిటి? అయినింటి ఆడపడుచుల్ని ఇంతసేపు కూర్చోబెట్టొచ్చా?" అంటూనే జవాబు కెదురుచూడకుండ, "ఇవి బాగున్నాయి కదండీ... ఖరీదు కొంచెం ఎక్కువేమోనండి..." అంది కూనలమ్మతో... "ఈ చీర చూడండి... " అనగానే - కూనలమ్మ 'చాలా బాగుందండీ... మీ ఛాయకు ఈడుజోడుగా - ఉంది -' కూనలమ్మ తమాషాగా నవ్వింది.

మరి తప్పదు కదా - చిలక కొనేసింది. ఈలోగా కూల్‌డ్రింక్‌లు దయచేశాయి.

గొప్ప ఖరీదు - గొప్ప చీర - తను గొప్ప మనిషి. అదే తను గొప్ప చిలక! అన్నీ గొప్ప గొప్ప - కాని ఇంటికి వచ్చాక, 'పప్పులో కాలేశావ్ చిలకా -' అంది పక్కింటి మనోహరి. ఉన్నమాటే అంది.

'ఈ సేల్సు కుర్రాళ్లు తక్కువ ధరల చీరలకి ఎక్కువ ధరల చీటీలు తగిలించి విసుగ్గెత్తిపోయి ఉన్నవారిమొహాన కొడ్తారు. అదే వాళ్ళ టెక్నిక్,' అంది. చిలకను మిన్నులు పడ్డచోటికి విసిరేసింది.

'ఘోరం - ఘోరం, అనుకుంది చిలక, పాపం కూనలమ్మను తిట్టుకుంది. మళ్ళీ ఆ షాపువాడి దగ్గరకు వెళ్ళి దీన్ని నువ్వే కట్టుకో' అని విసరలేక పోయింది. నామర్దా!

అప్పుడు మరీ చిన్నది. కాని ఇప్పుడు బాగా ఎదిగింది. ఎలాంటెలాంటి వారినైనా బోల్తా కొట్టించగలదు. మంత్రులు కాగానే అఖండమైన తెలివితేటలు తన్నుకొచ్చినట్లు,

డబ్బూ, దర్జా విరగబడిపోతే ఇట్టే అన్నీ అవగాహ నైపోతాయి. ఇది చిలక థీరీ.

ఒడుదుడుకులు లేకుండ ఆమె భర్త ఆకాశం అంచులుకి అంచెలంచెలుగా ఎదిగి పోయాడు. ఓ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో పెద్ద ఆఫీసరైపోయాడు. నెలకు ఐదు వేల రూపాయలు, కారు, ఇల్లు, విసిఆర్, టివి, ఫ్రిజ్ సరేసరి. ఏసి గదులు, మనోహరమైన పడక మంచాలు, ఫోమ్ బెడ్‌లు - గొప్ప సంచలనం సృష్టించే అధునాతన చిత్రాలతో ఆ ఇల్లు ఆర్ట్‌పీస్‌లా ఉంది. మనోహరమైన గార్డెనూ, కాలు వెయ్య బుద్ధిపుట్టని పచ్చని లానూ, ఆహ్లాదం అమృతం త్రాగినట్లుంది. ఇద్దరే పిల్లలు. అబ్బాయి, అమ్మాయి. ఆరు, ఏడేళ్లు. అందం చిగురేసినట్లుంటారు.

చిలక తల్లిలో ఎగోయిజం రోజు రోజుకూ జాస్తీ అయిపోయింది. తన ముందు అందర్నీ తక్కువ చేసేస్తే తప్ప ఆమెకు ఊపిరాడదు. అప్పుడే ఆమెకు సుఖప్రాప్తి! నిజానికి సంసార సుఖమొక్కటే మనుషులకు ప్రశాంతత నివ్వదు. అంతకన్న స్వర్గం చాలా వాటిల్లో ఉంది. వాటిని స్వంతం చేసుకొని, సుఖాన్ని సుఖంలో తేల్చి సుఖంగా, సుఖం కోసం సుఖమైపోవాలి! ఎంచక్కని ఆశ! ఇదే - ఇదే - ఆమె జీవితేచ్ఛ! వెంపర్లాట!

"అమ్మా - మా అమ్మాయి - పెద్ద మడ్సయిందండి - ఏటో నాకేటి తోసడం నేదు. సేతిలో సిల్లి గవ్వనేదు' అంటూ నిలిచింది దాసీ అప్పలకొండ.

'అలాగటే - శుభకార్యం గొప్పగా జరిపించు. ఇంద..' అంటూ మెరిసే రోజ్‌వుడ్ బీరువా తీసి వేయి రూపాయలు, తళ తళ మెరిసిపోయే సరికొత్త వంద రూపాయల నోట్లు పది అప్పలకొండ చేతిలో పెట్టింది. అప్పలకొండకు కళ్ళు బైర్లు కమ్మాయి. ఇంత ఆనందాన్ని సామాన్యులు భరించడం కష్టం కదా...!

'మాతల్లె - మాతల్లె - మా సిలకమ్మగోరు గొప్ప మడ్సి - తమరినాటోలుంటే నోకంలో కట్టాలే ఉండేవి కావు, రెండు వందలు సాలుతల్లీ, అంత డబ్బు నానేటి, సేసుకోను. మా తాగుబోతోడు ఇల్లు కల్లం సేసేత్తాడు. ఆడితో పడలేను. నన్ను రక్షించు తల్లీ -' అంది.

చిలక కుత కుత ఉడికి పోయింది. ఒక దాసీది తనలోని దాతృత్వపు లక్షణాన్ని ఇంతగా కాలరాచివేయడం తను సహించలేదు. 'అల్పులను అందలం ఎక్కించగూడదు. ఛీ - నీ ముఖం చూపించకు - ఫో - ఇక్కడ నుంచి. ఇంకెప్పుడూ ఇటు రాకు' అంది చిలక. ఆవేశంతో పెదవి చలిస్తూ ఉండగా ఎరుపెక్కిన కళ్ళతో మరో గదిలోకి వెళ్ళిపోయింది.

అసలు అప్పలకొండ ఆ రెండొందలూ అప్పుగా అడగాలనుకొంది. ఈ మాట ఆమె నోట జారి ఉన్నట్లయితే, అక్కడికక్కడే చిలకతల్లి, అప్పలకొండ ప్రాణాలు తోడేసి ఉండేది.

"ఆదరాన్ని చవిచూడలేని అలగాజనం!" చిలక గుండెలనిండా ఇదే మాట రెండు రోజులు త్రాచుపాములా బుసలు కొట్టింది. వారం రోజుల వరకు ఆమె తేరుకోలేదు.

ఓసారి రీడర్స్ డైజెస్ట్‌కు చందా కట్టి ఓ స్నేహితురాలికి 'ఈ సంవత్సరమంతా నీకు ఫ్రీగా వస్తుంది. స్వీకరించు' అంటూ ఆమె రాసిన ఉత్తరానికి జవాబుగా ఆ స్నేహితురాలు, "నేను ఆ మేగజైన్ ఫేన్‌ను. నీ తీయని మనసుకు నా చిరునవ్వులు." అంది.

"రాలుగాయి..." అనుకుంది చిలక!

ఆ పిల్ల చిరునవ్వులు చిలకకు ముళ్ళపొదలు!

పాపం!

కో ఆప్ టెక్స్ ఎసి షోరూమ్‌లోంచి వస్తూ భర్త డబ్బు చెల్లించేందుకు క్యూ ఉన్న కౌంటర్‌ముందు ఆగవలసి వచ్చింది. అక్కడే షో పీస్‌లా నేలచూపులు చూస్తూ నిలిచి ఉండలేక తమ ఎసి కారు వద్ద డిక్కీకి చిత్రంలా ఆనుకొని బట్టల పేకెట్లతో వచ్చే భర్త ఆగమనంకోసం కొంటెసీలా నిలిచి ఎదురు చూస్తూ ఉంది.

అప్పుడే ప్రముఖ రచయితగారి భార్య గుమ్మడిదల దుర్గాబాయమ్మగారంతటి సౌజన్యంతో నిండైన కుంకుమరేఖతో సాదాచీర, సాదాజాకెట్టు, ఉత్త గాజు గాజులు, హవాయి చెప్పులు, - ఆమె పేరూ దుర్గాబాయమ్మే - అటు వస్తోంది.

చిలకకు ఆమె తెలుసు. కదలీ కదలని కదలికతో చేతులెత్తకుండానే, 'నమస్కారం పిన్నిగారూ... చాన్నాళ్ళకు...' అంది తనకూ మర్యాద తెలుసన్నట్టు!

దుర్గాబాయమ్మగారిని మునుపు చిలక అక్కయ్యగారూ అనేది. ఇప్పుడావిడ ముఖంలో ముసలితనం ఏదో కనిపించి ఉంటుంది. అంచాత 'పిన్నిగారూ' - అంది. అక్కయ్యను పిన్నిగా మార్చగల శక్తి చిలకకు ఉంది. ఆమె మనసు అంతటిది.

పెరుగుతున్న వయసుతో మనసు పెరగకపోవడం అంటే ఇదే...

"ఓ... చిలకతల్లీ... బాగున్నావా..." అంది దుర్గాబాయమ్మ. ఆ తల్లీ పదం చెవిని పడగానే చిలక తల్లడిల్లిపోయింది. ఆ పదం అంటే ఆమెకు వికారం.

'ఏటోనండి. ఏం బాగు. మీ అల్లుడుగారు నెలకు అయిదువేలు తెస్తున్నారా - ఏమిటో ఎందుకూ చాలటం లేదు. వేలకి వేలు గుడ్డలకీ, చెప్పులకీ గుటకాయస్వాహ

అయిపోతున్నాయి' అంది. 'అంత చచ్చు చెప్పులు తొడిగావేం ముసలీ -' అనుకుంది మనసులో. నిండుగా ఉల్లాసమయింది.

దుర్గాబాయమ్మగారు చిలకను పైకీ కిందికీ చూసింది. తాపీగా ఆ కారునూ చూసింది. సంచులు మోసుకొస్తున్న ఆమె భర్తనూ చూసింది. మెల్లగా 'అవును తల్లీ - ఎంత వచ్చినా అలాగే ఉంది మాకూ - ఆరువేలు పైగానే వస్తున్నాయి. నెలకేలే - ఈ మాత్రం దానికే అంత గర్వమెందుకో - చిన్న సంచి కూడ ఆయన ముట్టరు. కూరగాయలు తేవడం ఎప్పుడో మరచిపోయారు. ఇహ డబ్బు సంగతి, ఎంత వచ్చినా ఏ సొత్తు బే సొత్తే. అజా పజా ఉండడంలేదు' అంది.

'ఏమిటీ ఆరువేలా? ఇప్పుడేంచేస్తున్నారు మీ వారు?' చిలక తలకిందులైపోయింది. ఆమె చెవులు వినగూడని మాటలు విన్నాయి. డిక్కీకి చేరిన దర్జా కదలిపోయింది. ఆమె మనసు బీటలు వారింది.

'అబ్బే - ఏమీ లేదు. ఎప్పటిలాగే ఆయనకు రెండువేలే. మా అబ్బాయికి కోడలకు మూడు వేలొస్తున్నాయి. మా చిన్నాడికి ఈ మధ్యే వెయ్యి దాటిస్తున్నారు' అంది దుర్గాబాయమ్మ.

చిలకతల్లి కనుగుడ్లు పేలిపోయాయి. అప్పుడే ఎందుకో డెబ్భైవేల రూపాయల వజ్రాల గాజులేపు చూసుకుంది. మీ మొహ మెట్టుకుని ఎన్నేళ్లకైనా కొనగలరా అనాలనుకుంది. గట్టిగా అరవాలని అనుకుంది. కాని ఆ డబ్బు సరియైన డబ్బు కాదే - దుర్గాబాయమ్మ తిన్నదైంది కాదు. మళ్లీ మరోటి అంటిస్తుంది. పూర్వం రాణీలను చూచిన వారు లేరు. వాళ్ళను కొట్టి వీళ్ళను కొట్టి వారి రాజా భర్తలు వారి కాళ్ళముందు వజ్ర వైడూర్యాలు రాసులు పోసేవారు. వాళ్ల కే శిక్షలూ లేవు. ప్రతి కవికీ, డ్యాన్సాడే పిల్లకీ లక్షలు లక్షలు కుమ్మరించేవారు. వాళ్ళను గొప్ప ధర్మాత్ములని ప్రజలు మరీ మరీ పొగిడేవారు.

ఇవాళ ఆ రాణీలను మించిన జీవితాన్నే అనుభవిస్తున్నా పైకి అలా కనిపించ గూడదు. ఎక్సైజ్ వాళ్లు, ఇన్‌కమ్‌టాక్స్ వాళ్లు పీడకలల్లా ఎదురౌతారు. ఛీ - వెధవ బతుకు - వెధవ దేశం -

చిలక చికాకు పడిపోయింది. ఆమె మనసు పూర్తిగా కుళ్లిపోయింది. మగడు ఏ కమీషనరాఫ్ పోలీస్ అయితే దుర్గాబాయమ్మను చితగ్గొట్టించేసేది. అప్పటికి కాని ఆమె కసి తీరేది కాదు. అసలు ఈ పని చేయడానికి మగడు ఓ పోలీసైనా చాలు కదా!

దుర్గాబాయమ్మగారి వైపు చూసి, పొరపాటునో పాత అలవాటు చొప్పునో,

'అక్కయ్య గారూ! త్వరగా కొనుక్కొచ్చెయ్యండి. మా ఇల్లు చూద్దురుగాని, రావుగారు మిమ్మల్ని ఇంటి దగ్గర దింపుతారు' అంది.

దుర్గాబాయమ్మ, 'నాకు కొంచెం పని ఉంది' అంది.

'అది కాదు - మళ్లీ ఎప్పుడు కలుస్తామో - ఏమో - నా రిక్వెస్ట్ తోసెయ్యకండి. ప్లీజ్ -' అంది.

దుర్గాబాయమ్మ బెట్టు చేసే రకం కాదు. సరే అంటూ కొట్లోకి వెళ్ళి పేకెట్‌తో తిరిగి వచ్చింది.

కారు క్షణాలమీద ఇంటికి చేరింది. ముందుసీట్లో భర్త పక్క కూర్చున్న చిలక, దారిలో 'పిన్నిగారూ - ఈ కాసిన్ని పేకెట్లు తెచ్చుకోలేమా - అని కుర్రాణ్ణి తీసుకు రాలేదు. పైపెచ్చు వెనకాల కూచొని మా కబుర్లు వాడు వినడం నాకు కిట్టదు' అంది.

దుర్గాబాయమ్మ ఆ పేకెట్ల ప్రక్క ఆ కుర్రాడు చూర్చున్న స్థానంలోనే కూర్చుంది. 'ఈ చిలకతో రావడం నాదే బుద్ధి తక్కువ' అనుకుంది.

అప్పటికే వారి ఇంటి ముందు గేటు తెరచుకొని లోపల ఇన్‌కమ్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఐటిఓలు హడావుడిగా రావు కోసం ఎదురు చూస్తున్నట్లు కూర్చున్నారు. రావు గుండె లాగిపోయాయి.

'సారీ రావు గారూ - ఒక్కసారి మీరు ఇంట్లోకి రావాలి. ఇదిగో సెర్చ్ వారంట్' అన్నాడు.

చిలక 'ఎవరు వీళ్లంతా -' అంది. గుండెల్లో 'ఏవో ప్రేలుళ్ళు . 'యములాళ్ళు' అన్నాడు భర్త మెల్లగా.

'నేనీ రిక్షాలో వెళ్ళిపోతాను'. రిక్షాను పిలిచింది దుర్గాబాయమ్మ. 'ఈ పరిస్థితిలో, నేను వుండడం అంత మంచిది కాదు' అనుకుంది.

'ఈ గాజులు ప్రస్తుతానికి మీ ఇంట్లో ఉంచండి. మమ్మల్ని కాపాడండి' పాపం చిలక ప్రాధేయపడింది.

'రేపు ఈ బాధ నాకైనా తప్పదుగా - నీ చెంగున ముడేసేసి బొడ్డులో దోపెయ్' అంటూ వెళ్లిపోయింది దుర్గాబాయమ్మ.

గదిలో ఆఫీసరు, 'ఎప్పుడు కొన్నారు ఈ గాజులు?' అన్నాడు.

చిలక నిబ్బరంగా, తెలివిగా 'కొనడమేమిటండి. నాకు చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు. వాళ్లకు నేనంటే ఎంతో ఇష్టం. వాళ్ళలో ఒకరు మొన్ననే వీటిని ప్రెజెంట్ చేశారు' అంది.

కష్టాల్లోంచి తప్పించుకోడానికి నైతికమయిన విలువలు డబ్బున్నోళ్ళకెప్పుడూ అడ్డురావు!

ఆమె భర్త చాలా తెలివైనవాడు కదా - చిన్న కాగితం ముక్కకూడ అదే - రహస్యాలు బయటపెట్టేవి - వాటి ఆచూకీ దొరకనివ్వలేదు. ఆఫీసర్లు అంతా గాలించి ముఖముఖాలు చూసుకున్నారు.

విసుగ్గా సారీ చెప్తూ వెళ్ళిపోయారు.

"మిమ్మల్ని నేనే రక్షించాను. చూశారా - అలా ఫ్రెండ్స్ వాటిని ఇచ్చారని అనక తప్పలేదు. క్షమించండీ - అన్నట్టు గోరోజనం చిలక గాజుల భర్తవైపు చూసింది. కాని అప్పుడామె మనసులోముఖమూ, ఆముఖంలో మనసూ లేవు! 'దుర్గాబాయమ్మను మాత్రం చావుదెబ్బలు కొట్టాలి ఊఁ -' అనుకుంది.

(భారతి, ఫిబ్రవరి 1986)